
సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
శుక్రవారం, 10, జనవరి, 2025



సోమశిలలో 71.23 టీఎంసీలు

సోమశిల: సోమశిల జలాశయంలో గురువారానికి 71.23 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఎగువ ప్రాంతాల నుంచి 1941 క్యూసెక్కుల ప్రవాహం వస్తోంది.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10గ్రాములు)	రూ.80,170
22 క్యారెట్లు ఆర్నమెంట్ (1 గ్రా)	రూ.7,271
3శాతం జీఎస్టీతో	రూ.7,489
నవర (8గ్రా)	రూ.59,912

గరిష్టం/కనిష్టం
29.3 /21.6

వాతావరణం

జిల్లాలో వాతావరణం శుక్రవారం సాధారణంగా ఉంటుందని ఆ శాఖ అధికారులు తెలిపారు. గాలిలో తేమ 60 శాతంగా గురువారం నమోదైంది.

న్యూస్‌రీల్

గోకులాల నిర్మాణాలు వేగవంతం



మాట్లాడుతున్న గంగాభవానీ

నెల్లూరు (పొగతోట): గోకులాల నిర్మాణాలను వేగవంతం చేయాలని డ్వామా పీడీ గంగాభవానీ ఆదేశించారు. నగరంలోని డ్వామా కార్యాలయం నుంచి మండలాధికారులతో గురువారం నిర్వహించిన టెలి కాన్ఫరెన్స్‌లో ఆమె మాట్లాడారు. ఇప్పటి వరకు 300 మినీ గోకులాల నిర్మాణాలను పూర్తి చేశారని చెప్పారు. శ్రమ శక్తి సంఘాలను ప్రోత్సహించి వారి ద్వారా ఉపాధి పనులకు హాజరయ్యే వారి సంఖ్యను పెంచాలని కోరారు. నూతన శ్రమశక్తి సంఘాలను ఏర్పాటు చేసేలా చర్యలు చేపట్టాలని సూచించారు. జిల్లాలోని జగనన్న కాలనీలను క్వాలిటీ కంట్రోల్ ఇంజినీర్లు పరిశీలించనున్నారని పేర్కొన్నారు.

మానవ హక్కుల కమిషన్ సభ్యురాలి రాక రేపు

నెల్లూరు రూరల్: జాతీయ మానవ హక్కుల కమిషన్ సభ్యురాలు విజయభారతి సాయని నెల్లూరుకు శనివారం రానున్నారని డీడీ సదారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 15 వరకు నగరంలో బస చేయనున్నారని, 16న తిరుపతి బయల్దేరనున్నారని చెప్పారు.

నేటి నుంచి కెపాసిటీ బిల్డింగ్ ప్రోగ్రామ్

నెల్లూరు (టౌన్): నగరంలోని వీఆర్ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన జాతీయ విద్యా పరిశోధన మండలి (ఎన్సీఈఆర్టీ)లో కెపాసిటీ బిల్డింగ్ ప్రోగ్రామ్‌ను శుక్ర, శనివారాల్లో నిర్వహించనున్నారు. రాష్ట్రంతో పాటు తమిళనాడు, తెలంగాణ, పుదుచ్చేరి, కేరళ, లక్షద్వీప్‌లోని డైట్ కళాశాలల్లో పనిచేస్తున్న అధ్యాపకులకు రెండు రోజుల పాటు ఓరియెంటేషన్ ప్రోగ్రామ్‌ను జరపనున్నారు. జాతీయ విద్యావిధానంలో భాగంగా 2022, 23 జాతీయ పాఠ్య ప్రణాళికపై రూపొందించిన పాఠ్య పుస్తకాలను 1, 2, 3, 6వ తరగతుల విద్యార్థులకు ఏ విధంగా బోధించాలనే అంశం తదితరాలపై వివరించనున్నారు.

ఆర్టీసీ బస్‌పాస్ కేంద్రానికి రేపట్నుంచి సెలవులు

నెల్లూరు సిటీ: సంక్రాంతిని పురస్కరించుకొని ఆర్టీసీ బస్‌పాస్ కేంద్రానికి శనివారం నుంచి బుధవారం వరకు సెలవులను ప్రకటించామని జిల్లా ప్రజా రవాణాధికారి మురళీబాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. స్టూడెంట్స్, జర్నలిస్ట్ పాస్ కేంద్ర సేవలను శుక్రవారం వినియోగించుకోవాలని కోరారు.

వ్యాపారం.. బేజారు



ఆకర్షిస్తున్న మార్టులు

స్టోన్‌హౌస్‌పేటలో నాటి సందడేదీ..?

- ఒకప్పుడు రూ.40 కోట్ల నుంచి రూ.50 కోట్ల బిజినెస్
- నేడు రూ.20 కోట్లకే పరిమితం
- మార్టులు, ఆన్‌లైన్ యాప్‌లపైనే నేడు మోజు
- ఆఫర్లతో ఆకర్షిస్తూ.. మార్కెట్‌ను కొల్లగొడుతూ..

సంక్రాంతి.. తెలుగు వారి పెద్ద పండగ.. ఇది వచ్చిందంటే పిండి వంటలు తదితరాల తయారీకి అవసరమైన వస్తువులను కొనుగోలు చేసేందుకు నగరంతో పాటు జిల్లా వాసులు స్టోన్‌హౌస్‌పేట ప్రాంతానికి పోటెత్తుతుంటారు. ఈ క్రమంలో ఏటా ఇక్కడ సందడి నెలకొనేది. అయితే ఇదంతా గతం. ప్రస్తుతం సూపర్ మార్కెట్లు రావడం.. క్షణాల్లో ఇంటికే సరుకులను డెలివరీ చేసే యాప్‌లు పుట్టుకురావడంతో ఎక్కువ మంది వీటివైపే మొగ్గు చూపుతున్నారు. ఫలితంగా వ్యాపారాలు కుదేలై విక్రేతల్లో ఉత్సాహం కరువవుతోంది.



స్టోన్‌హౌస్‌పేటలోని ఓ వీధి

నెల్లూరు సిటీ: వ్యాపారంలో జిల్లాకే తలమానికమైన స్టోన్‌హౌస్‌పేట నాటి ప్రాభవాన్ని కోల్పోతోంది. నగరంలో ప్రముఖ కంపెనీలు ఏర్పాటు చేసిన సూపర్ మార్కెట్లు దీనికి ఓ కారణమైతే.. సరుకుల డెలివరీ యాప్‌లు ఇబ్బడిముబ్బడిగా వస్తుండటం మరో కారణమవుతోంది. నిత్యావసర సరుకులు, దుస్తులు తదితరాలన్నీ ఒకే చోట లభ్యమవుతుండటంతో మార్టులకు.. ఇంటి నుంచి బయటకెళ్లాల్సిన అవసరమే లేకపోవడంతో డెలివరీ యాప్‌లపై ఎక్కువ మంది ఆసక్తి కనబరుస్తున్నారు.

నాడెంతో ఘనం..

సంక్రాంతి వచ్చిందంటే స్టోన్‌హౌస్‌పేట ప్రాంతం గతంలో కళకళలాడేది. అక్కడికి వెళ్లాలంటే కనీసం అర్ధగంట పట్టేది. కిక్కిరిసిన దుకాణాలు.. వినియోగదారుల కోలాహలంతో వ్యాపారులు బిజీబిజీగా ఉండేవారు. అయితే పరిస్థితులు ప్రస్తుతం పూర్తిగా మారిపోయాయి. కొనుగోలుదారుల కోసం విక్రేతలు నిరీక్షించాల్సిన పరిస్థితి ఉత్పన్నమవుతోంది.

వ్యాపారం భారీగా పతనం

వాస్తవానికి స్టోన్‌హౌస్‌పేటలో 25 హోల్‌సేల్.. 15 బెల్లం, చింతపండు.. ఐదు ఆయిల్ దుకాణాలు.. 120 రిటైల్ షాపులున్నాయి. ఏటా సంక్రాంతి సందర్భంగా ఇక్కడ దాదాపు రూ.40 కోట్ల నుంచి రూ.50 కోట్ల వరకు వ్యాపారం జరిగేది. జిల్లాలో దాదాపు పది వేల నిత్యావసర సరుకుల షాపులుండగా, నగరంలోనే 4500 దుకాణాలున్నాయి. వీరు సైతం ఇక్కడి హోల్‌సేల్ దుకాణాల్లో కొనుగోలు చేసేవారు. అయితే ప్రస్తుతం వీరికి కొన్ని పెద్ద కంపెనీలు సరుకులను నేరుగా అందిస్తున్నాయి. దీంతో వీరి రాకా తగ్గింది. ఈ పరిణామాల క్రమంలో ప్రస్తుతం రూ.18 కోట్ల నుంచి రూ.20 కోట్ల వరకే వ్యాపారం పరిమితమైందని విక్రేతలు పేర్కొంటున్నారు.

ఆకర్షిస్తున్న మార్టులు

నగరంలో వివిధ కంపెనీలకు సంబంధించి దాదాపు 10 మార్టులు వెలిశాయి. వినియోగదారులను ఆకర్షించాలనే లక్ష్యంతో తగ్గింపు ధరలకే వీరు వస్తువులను విక్రయిస్తుండటంతో అనేక మంది వీటివైపే మొగ్గు చూపుతున్నారు. నిత్యావసర సామగ్రి అవసరమైతే ఇంట్లో ఎవరో ఒకరు వెళ్లి వీటిని కొనుగోలు చేసి తీసుకురావడమనేది గతంలో ఉండేది. అయితే సూపర్ మార్కెట్లలో సరుకులు, దుస్తులు, తినుబండారాలు, ఎలక్ట్రానిక్ వస్తువులు సైతం లభ్యమవుతుండటంతో కుటుంబ సమేతంగా వెళ్లి షాపింగ్ చేస్తూ కాలక్షేపం చేస్తున్నారు. ఉదాహరణకు ఓ సబ్బు ధర రూ.65 ఉంటే మార్టులో రూ.52కే వస్తోంది. మినప్పప్పు, కందిపప్పు, చక్కెర, బెల్లం తదితర వస్తువుల పరిస్థితీ ఇంతే. డబ్బులు ఆదా అవుతుండటం.. పైగా రోజువారీ పనుల నుంచి కొంత ఉపశమనం లభిస్తుందనే ఉద్దేశంతో మార్టులకే ఎక్కువ మంది జై కొడుతున్నారు.



నూనె డబ్బాలను తరలిస్తున్న హమాలీ

15 నిమిషాల్లో డెలివరీ..

ప్రస్తుత కాలానికి అనుగుణంగా ప్రజల్లోనూ మార్పొస్తోంది. ఇంటి నుంచి బయటకెళ్లి షాపుల్లో కొనుగోలు చేయడం.. బిల్లు కోసం నిరీక్షించడం.. ఆపై వీటిని ఇంటికి మోసుకురావడం తమ వల్ల కాదనే భావనా ఇప్పుడిప్పుడే వస్తోంది. ఈ తరుణంలో వస్తువులను క్షణాల్లో ఇంటికి డెలివరీ చేసే యాప్‌లను ప్రముఖ కంపెనీలు రూపొందించాయి. పాలు మొదలుకొని కూరగాయలు, బియ్యం తదితరాలను ఆర్డర్ చేయడం వీటిలో ప్రత్యేకత. ఒకరితో మరొకరు పోటీపడుతూ.. డిస్కౌంట్లు, ఆఫర్లనూ అందజేస్తున్నాయి. ఆర్డర్ చేసిన 15 నిమిషాల నుంచి మూడు గంటల్లో సరుకులను ఇంటి ముంగిటే అందజేస్తుండటంతో ప్రజలు ఎంచక్కా కాఫీ తాగుతూ తమ ఫోన్లలో ఎడాపెడా ఆర్డర్లు పెడుతున్నారు. వ్యాపారుల పాలిట ఇదీ ఓ శాపంగా పరిణమిస్తోంది.

మార్టుల కారణంగా వ్యాపారాలు తగ్గాయ్



గతంలో మూడు నెలల వ్యాపారం కేవలం సంక్రాంతి సమయంలోనే జరిగేది. అయితే ఇప్పుడా పరిస్థితే లేదు. వ్యాపారాలు తగ్గాయ్. మార్టుల రాకతో ప్రజలు వాటికి ఆకర్షితులవుతున్నారు.
– ఎం శ్రీనివాసులు, డిస్ట్రిక్ట్ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ట్రేడ్ ప్రెసిడెంట్

రానున్న రోజుల్లో గడ్డుకాలమే



మార్టులొచ్చాక వ్యాపారాలు తగ్గుతూ వస్తున్నాయి. ఇప్పుడు పరిస్థితి దారుణంగా మారింది. సంక్రాంతి సమయంలో స్టోన్‌హౌస్‌పేట కిటకిటలాడేది. ప్రస్తుతం వ్యాపారాలు సగానికిపైగా తగ్గాయ్.
– అద్దేపల్లి సుబ్బారావు, కిరాణా మర్చంట్స్ అసోసియేషన్ సెక్రటరీ

ఇది స్టోన్‌హౌస్‌పేటేనాననే అనుమానం వస్తోంది



సంక్రాంతికి ముందే స్టోన్‌హౌస్‌పేట ప్రాంతం రద్దీగా ఉండేది. ఇప్పుడు పరిస్థితి సాధారణంగా ఉంది. అసలు ఇది ఆ ప్రాంతమాననే అనుమానం వస్తోంది. వ్యాపారాలు తగ్గిపోవడాన్ని చూస్తుంటే బాధగా ఉంది.
– అశోక్, ప్రైవేట్ ఉద్యోగి

ఆఫర్లు ఉండటంతోనే..



మార్టుల్లో ప్రతి వస్తువులపై ఆఫర్లిస్తున్నారు. దీంతో అక్కడ కొనుగోలు చేసేందుకే మొగ్గు చూపుతున్నాం. ఎక్కడ తక్కువకు లభిస్తే అక్కడ కొనుగోలు చేయడం సర్వసాధారణం. అందుకే అక్కడ వ్యాపారం పెరుగుతోంది. – సాజిద్, రంగనాయకులపేట

వేదగిరిలో హుండీ కానుకల లెక్కింపు



నెల్లూరు సిటీ: నరసింహకొండపై వెలసిన వేదగిరి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో హుండీ కానుకలను గురువారం లెక్కించారు. హుండీల ద్వారా రూ.5,47,818.. అన్నదాన హుండీలో భక్తులు రూ.11,827 మేర సమర్పించారని ఈఓ వేమూరి గోపీ తెలిపారు. దేవదాయ శాఖ నెల్లూరు పరిశీలకుడు సుధీర్, ప్రధానార్చకుడు భాస్కరాచార్యులు, అర్చకులు కృష్ణమాచార్యులు, మురళీధరాచార్యులు, అప్పలాచార్యులు, రాఘవాచార్యులు పాల్గొన్నారు.

పారా మెడికల్ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు (టౌన్): ప్రభుత్వ వైద్య కళాశాలలో డిప్లొమా కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని ప్రిన్సిపల్ నాగరాజమన్నార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాతో పాటు ఇతర జిల్లాల్లో అర్హత కలిగిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. వీటిని కళాశాల లేదా acsrgmcnlr@gmail.comలో ఈ నెల 28లోపు సమర్పించాలని సూచించారు.

నూరు శాతం ఉత్తీర్ణతే లక్ష్యం

- జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ



మాట్లాడుతున్న అరుణమ్మ

నెల్లూరు (పొగతోట): పదో తరగతి పరీక్షల్లో నూరు శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని జెడ్పీ చైర్ పర్సన్ ఆనం అరుణమ్మ పిలుపునిచ్చారు. విజయదీపిక స్టడీ మెటీరియల్‌ను రూపొందించిన ఉపాధ్యాయులను నగరంలోని జెడ్పీ కార్యాలయంలో గురువారం సత్కరించిన అనంతరం ఆమె మాట్లాడారు. జిల్లాలోని 318 జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో 15,597 మంది విద్యార్థులు పదో తరగతి చదువుతున్నారని, వీరందరికీ విజయదీపిక స్టడీ మెటీరియల్‌ను అందజేయనున్నామని చెప్పారు. పరీక్షలకు సమాయత్తం చేసేందుకు అన్ని సబ్జెక్టులకు సంబంధించిన 40 మంది ఉపాధ్యాయులు, విషయ నిపుణులతో చర్చించి దీన్ని రూపొందించామని వెల్లడించారు. ఇంగ్లిష్, తెలుగు మీడియాల్లో ఇది అందుబాటులో ఉందని, పంపిణీ ప్రారంభమైందన్నారు. ఉత్తమ ఫలితాలను సాధించి జిల్లాను రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలపాలని కాంక్షించారు. జెడ్పీ సీఈఓ విద్యారమ, డిప్యూటీ సీఈఓ మోహన్‌రావు, డీఈఓ బాలాజీరావు, డీసీఈబీ సెక్రటరీ రామ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వేసిన ప్యాచ్ వర్క్‌లు నెలలోపే మాయం

- మళ్లీ మళ్లీ అవే పనులు
- నాసిరకంగా మారిన వైనం
- చోద్యం చూస్తున్న అధికారులు
- ఆర్ అండ్ బీ శాఖలో ఇదీ పరిస్థితి
- తాజాగా రూ.18.44 కోట్లతో పనులు

అతుకులు వేసినా.. మళ్లీ గతుకులే



డైకస్ రోడ్డు వద్ద ఛిద్రమైన రహదారి



గుంత వద్ద ఏర్పాటు చేసిన బండ

నెల్లూరు(అర్బన్): కూటమి ప్రభుత్వం ఏర్పడిన అనంతరం రోడ్లను బాగుచేయిస్తున్నట్లు సీఎం చంద్రబాబు కలరింగ్ ఇచ్చారు. రాష్ట్ర వ్యాప్తంగా రోడ్ల బాగుకు నిధులు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. సంక్రాంతి నాటికి గుంతల్లేని రోడ్లు అంటూ ఊదరగొట్టారు. దీంతో పల్లె, పట్టణమనే తేడా లేకుండా తమ ప్రాంతాల్లో రోడ్లు బాగుపడుతాయని ప్రజలు ఆశించారు. అయితే అదంతా వట్టి డొల్లతనమేననే విషయం తేలింది. వందల కోట్ల రూపాయలు అవసరమైన చోట నామమాత్రంగా నిధులు విదిలించడంతో అధికారులు, కాంట్రాక్టర్లు కుమ్మక్కై నాసిరకంగా ప్యాచ్ వర్క్‌లు వేస్తున్నారు. అవి కూడా వేసిన వారం నుంచి నెల్లోపే తారు లేచిపోయి గుంతలు యథావిధిగా దర్శనమిస్తున్నాయి.

122 పనులకు రూ.18.44 కోట్ల విడుదల

జిల్లాలో ఆర్ అండ్ బీ శాఖ పరిధిలో 770 కిలోమీటర్ల రోడ్లకు సంబంధించి 122 చోట్ల ప్యాచ్ వర్క్‌లు వేసేందుకు ప్రభుత్వం రూ.18.44 కోట్లు విడుదల చేసింది. రోడ్లన్నీ బాగుపడాలంటే సుమారు రూ.1700 కోట్లు ఖర్చవుతాయని అధికారులు నివేదిక పంపారు. అయితే రూ.18.44 కోట్లనే విడుదల చేసి ప్యాచ్ వర్క్‌లతో సరిపెట్టుకోవాలని కూటమి ప్రభుత్వం సెలవిచ్చింది. దీంతో నాసిరక ప్యాచ్ వర్క్‌లే దిక్కుగా మారాయి. గత నెల్లో 10 శాతం పనులు కూడా జరగలేదు. సంక్రాంతిలోపు ప్యాచ్ వర్క్‌లు పూర్తయ్యేలా లేవు. సంక్రాంతికి గోతుల్లేని రోడ్లు అనేది వట్టి బూటకంగా మిగిలిపోనుంది. పలు చోట్ల కేవలం కంకర డస్ట్ మాత్రమే వేసి రోడ్లకు ప్యాచ్ వర్క్‌లు పూర్తి చేసినట్లు మమ అనిపిస్తున్నారు. ఇలా నెల్లూరు నగరంలోని అపోలో ఆస్పత్రి సెంటర్ నుంచి ఎల్‌ఐసీ కాలనీ మీదుగా బైపాస్ వరకు ఉన్న సుమారు అర కిలోమీటర్ రోడ్డులో ఈ ఏడాదిలో ఇప్పటికే మూడు దఫాలు కంకర డస్ట్ పోశారు. రోడ్డు బాగుందనే రీతిలో చూపించారు. అయినా ఇప్పటికీ ఆ రోడ్డులో అనేక పెద్ద పెద్ద గుంతలు దర్శనమిస్తున్నాయి. ఇదే విధంగా పొదలకూరు రోడ్డు, బీవీ నగర్ రోడ్లలో పలు చోట్ల కంకర డస్ట్‌తో కూడిన ప్యాచ్ వర్క్‌లే కనిపిస్తున్నాయి. అవి కూడా వారం రోజులకే డస్ట్ పోయి గోతులు ఏర్పడుతున్నాయి. నగర డీఎస్పీ కార్యాలయం వద్ద బీటీ రోడ్డు సైతం కంకర తేలిపోయింది. కరెంటాఫీస్ వద్దా ఇదే పరిస్థితి.

వర్షాలతో తారు లేచిపోతోంది



తారురోడ్డు కాలపరిమితి ఆ ప్రాంతంలోని సాయిల్‌ను బట్టి మూడు నుంచి ఐదేళ్ల వరకు ఉంటుంది. వర్షాలకు రోడ్లు దెబ్బతిని తారు లేచిపోతోంది. నెల్లూరులోని రాజరాజేశ్వరి గుడి వద్ద తేలికపాటి జల్లులు పడినా నీరు నిలుస్తోంది. దీంతో అక్కడ త్వరగా రోడ్లు తారు లేచిపోతున్నాయి. నిబంధనల మేరకు నాణ్యతతో రోడ్లు వేస్తున్నాం.
– గంగాధరం, ఆర్ అండ్ బీ సర్కిల్ ఎస్‌ఈ

సబ్సిడీ రుణాలతో పారిశ్రామికవేత్తలుగా ఎదగండి



మాట్లాడుతున్న నాగరాజకుమారి

నెల్లూరు (పొగతోట): పీఎం అనుసూచిత్ జాతి అభ్యుదయ్ యోజన ద్వారా సబ్సిడీ రుణాలను సద్వినియోగం చేసుకొని పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని డీఆర్డీఏ పీడీ నాగరాజకుమారి పిలుపునిచ్చారు. పీఎం – ఏజేఏవై పథకంలో ఎంపికైన వారికి నగరంలోని డీఆర్డీఏ సమావేశ మందిరంలో గురువారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఎస్సీ కార్పొరేషన్ ద్వారా సబ్సిడీ రుణాలను మంజూరు చేయనున్నారని వెల్లడించారు. రుణాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం ఎస్సీ కార్పొరేషన్ ఈడీ నిర్మలారెడ్డి మాట్లాడారు. ఎంపిక చేసిన యూనిట్లను సకాలంలో ఏర్పాటు చేయాలని సూచించారు. పేదరికంలో ఉన్న వారిని ప్రోత్సహించాలనే లక్ష్యంతో కార్యక్రమానికి ప్రభుత్వం రూపకల్పన చేసిందని చెప్పారు.

క్లుప్తంగా

ముగిసిన పోలీస్ దేహదారుఢ్య పరీక్షలు

• మెయిన్స్ రాత పరీక్షకు 1,770 మంది అర్హత


సర్టిఫికెట్లను పరిశీలిస్తున్న ఐజీ

నెల్లూరు(క్రైమ్): నెల్లూరు పోలీస్ కవాతు మైదానంలో నిర్వహిస్తున్న కానిస్టేబుల్ అభ్యర్థుల దేహదారుఢ్య పరీక్షలు గురువారంతో ముగిశాయి. చివరిరోజు గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ట త్రిపాఠి పరీక్షలను పరిశీలించారు. పోలీస్ కానిస్టేబుల్ ప్రిలిమినరీ రాతపరీక్షలో క్వాలిఫై అయిన 4,692 మంది అభ్యర్థులకు ఎస్పీ జి.కృష్ణకాంత్ పర్యవేక్షణలో గతనెల 30వ తేదీ నుంచి గురువారం వరకు దేహదారుఢ్య పరీక్షలు నిర్వహించారు. 3,334 మంది హాజరుకాగా అందులో 1,770 మంది (పురుషులు 1,573, మహిళలు 197) మెయిన్స్ రాతపరీక్షకు అర్హత సాధించారు. తొమ్మిదిరోజులపాటు సమర్థవంతంగా విధులు నిర్వహించిన సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

మోటార్‌బైక్‌లను ఢీకొన్న కారు

• ముగ్గురికి గాయాలు

పొదలకూరు: రెండు మోటార్‌బైక్‌లను వెనుక నుంచి కారు ఢీకొనడంతో ముగ్గురు వ్యక్తులు తీవ్రంగా గాయపడిన ఘటన పొదలకూరుకు సమీపంలో నెల్లూరు మార్గంలో గురువారం జరిగింది. పోలీసుల కథనం మేరకు.. సైదాపురం మండలం తలుపూరు నుంచి పొదలకూరు మీదుగా బుచ్చిరెడ్డిపాళేనికి బైక్‌పై నాగేంద్ర, హరిత వెళ్తున్నారు. మరో బైక్‌పై పొదలకూరు నుంచి నెల్లూరుకు మస్తాన్‌బాబు, యూసఫ్ మహ్మద్ బయలుదేరారు. ఈ సమయంలో పొదలకూరు మీదుగా నెల్లూరుకు వెళ్తున్న కారు ఆ రెండు బైక్‌లను వెనుక నుంచి ఢీకొంది. ఈ ప్రమాదంలో బైకులపై వెళ్తున్న వారు గాయపడ్డారు. కారు ఎవరిదనేది తెలియరాలేదు. సమాచారం అందుకున్న ఎస్సై ఎస్కే హనీఫ్ ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. క్షతగాత్రులను 108 అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించారు.

జెడ్పీలో ఉద్యోగోన్నతులు


ఉత్తర్వులు అందుకున్న ఉద్యోగులతో చైర్‌పర్సన్, అధికారులు

నెల్లూరు(పొగతోట): జిల్లా పరిషత్‌కు సంబంధించి వివిధ మండలాల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు పదోన్నతులు కల్పించారు. వాటికి సంబంధించిన ఉత్తర్వులను చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ గురువారం తన చాంబర్‌లో అందజేశారు. ఒకరికి పరిపాలనాధికారి, నలుగురికి సీనియర్ సహాయకులుగా, ఐదుగురికి జూనియర్ సహాయకులుగా, ఒకరికి టైపిస్ట్‌గా పదోన్నతి కల్పించారు. కారుణ్య నియామకం కింద ఒకరికి జూనియర్ సహాయకులుగా ఉత్తర్వులిచ్చారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ విద్యారమ, డిప్యూటీ సీఈఓ మోహన్‌రావు పాల్గొన్నారు.


బ్రిడ్జి రక్షణ గోడలకు వేసిన పసుపు రంగు


తెప్పోత్సవం జరిగే చోట గోడపై ఇలా..


బ్రిడ్జి సైడ్ భాగంలో..

తమ్ముళ్ల రంగుల పిచ్చి

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తెలుగు తమ్ముళ్లకు రంగుల పిచ్చి ముదిరింది. చంద్రబాబు ముఖ్యమంత్రి అయ్యాక సచివాలయాలకు, ఇంకా తమకు అవకాశమున్న ప్రతిచోటా టీడీపీ రంగు వేయించారు. రానురానూ ఈ పరిస్థితి అధికమవుతోంది. నెల్లూరు నగరంలో మినీబైపాస్ రోడ్డులో బీవీనగర్ వద్ద డివైడర్లకు ఇటీవల పసుపు రంగు పడింది. ఇంకా దేవాలయాలకు సంబంధించిన కార్యక్రమాలనూ టీడీపీ నేతలు వదల్లేదు. కనుమ పండగ సందర్భంగా నవాబుపేటలోని భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి తెప్పోత్సవం జరుగుతుంది. ఈ నేపథ్యంలో ఉత్సవం జరిగే ఘాట్, మైపాడు గేట్ బ్రిడ్జికి పసుపు రంగులు పూయించారు. దీనిపై ప్రజానీకం విస్మయం చెందుతోంది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నెల్లూరు


నెల్లూరు మినీబైపాస్ రోడ్డులో డివైడర్లకు వేసిన రంగు

విద్యార్థులపై ప్రాక్టికల్స్ భారం

కూటమి ప్రభుత్వం విద్యావ్యవస్థను నిర్లక్ష్యం చేస్తోంది. కార్పొరేట్, ప్రైవేట్ మాత్రమే తమకు ముఖ్యమనేలా వ్యవహరిస్తోంది. సర్కారు జూనియర్ కళాశాలల్లో ఖాళీలను రెగ్యులర్ అధ్యాపకులతో భర్తీ చేయకుండా కాంట్రాక్ట్, గెస్ట్ ఫ్యాకల్టీతోనే కాలం వెళ్లదీస్తోంది. సరిపడా నిధులు విడుదల చేయకపోవడంతో ల్యాబ్‌లు ఖాళీగా దర్శనమిస్తున్నాయి. ఇంటర్ విద్యార్థులకు అరకొరగా ప్రాక్టికల్స్ నిర్వహిస్తూ మమ అనిపిస్తున్నారు. గతంలో ప్రాక్టికల్స్ నిర్వహణ కోసం కళాశాలను బట్టి రూ.30 వేల నుంచి రూ.50 వేలు ప్రత్యేక నిధులు విడుదల చేశారు. కూటమి ప్రభుత్వంలో ఒక్క రూపాయి ఇవ్వలేదు.

పరికరాలు, రసాయనాలకు నిధుల నిలిపివేత

- విద్యార్థుల నుంచి రూ.400 వసూలు చేస్తున్న వైనం
- వచ్చే నెల 10వ తేదీ నుంచి ఇంటర్ ప్రాక్టికల్స్
- 106 మందే రెగ్యులర్ అధ్యాపకులు
- కాంట్రాక్ట్, గెస్ట్ ఫ్యాకల్టీ అధ్యాపకులతోనే బోధన


ప్రాక్టికల్స్‌కు హాజరైన విద్యార్థులు (ఫైల్)

నెల్లూరు(టౌన్): జిల్లాలో ప్రభుత్వ – 23, ఎయిడెడ్ – 2, మున్సిపల్ – 1, ఏపీ మోడల్ – 11, సోషల్ వెల్ఫేర్ – 6, కేజీబీవీ – 12, హైస్కూల్ ప్లస్ – 16 జూనియర్ కళాశాలలున్నాయి. వీటిల్లో ప్రథమ, ద్వితీయ సంవత్సరాలకు సంబంధించి ఐదువేల మందికి పైగా విద్యార్థులు చదువుతున్నారు. 3,400 మందికి పైగా మ్యాథ్స్, సైన్స్ కోర్సులు అభ్యసిస్తున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో నాడు – నేడు రెండో విడతలో 22 జూనియర్ కళాశాలలను ఎంపిక చేశారు. ఇక్కడ సదుపాయాల కల్పన కోసం రూ.13 కోట్లు మంజూరు చేశారు. వాటిల్లో రూ.7 కోట్లను నిర్మాణాలు, ఫర్నీచర్ తదితరాల కోసం ఖర్చు చేశారు. రూ.3 కోట్లు సెంట్రల్ ప్రొక్యూర్‌మెంట్ కింద వస్తువులను అందజేశారు. మిగిలిన నిధులు రావాల్సి ఉంది. కూటమి ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి నాడు – నేడుకు ఒక్క పైసా నిధులు విడుదల చేయకపోవడంతో పనులు నిలిచిపోయాయి.

ఫీజుల నుంచే..

ఇంటర్ విద్యార్థులకు వచ్చేనెల 10వ తేదీ నుంచి పబ్లిక్ ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహించనున్నారు. విద్యా సంవత్సరం ప్రారంభం నుంచి ప్రథమ, ద్వితీయ సంవత్సరం వారికి ఫిజిక్స్, కెమిస్ట్రీ, బోటనీ, జువాలజీ సబ్జెక్ట్‌లకు ప్రాక్టికల్స్ నిర్వహించాల్సి ఉంటుంది. వారానికి ఒక్కో సబ్జెక్ట్‌కు రెండు ప్రాక్టికల్స్ చొప్పున ఏర్పాటు చేయాలి. గతంలో ప్రభుత్వ యాజమాన్య జూనియర్ కళాశాలల్లో ప్రాక్టికల్స్ నిర్వహణ కోసం ఏడాదికి రూ.30 వేల నుంచి రూ.50 వేలు విడుదల చేసేవారు. అయితే కూటమి ప్రభుత్వం వచ్చాక పరిస్థితులు మారాయి. ఈ విద్యా సంవత్సరంలో విద్యార్థి చెల్లిస్తున్న రూ.2 వేల ఫీజులో రూ.400 ప్రాక్టికల్స్ కోసం కేటాయిస్తున్నారు. వసూలు చేసిన మొత్తం ల్యాబ్‌ల్లో పరికరాలు, రసాయనాల కొనుగోళ్లకు సరిపోకపోవడంతో ఆయా కళాశాలల్లో అధ్యాపకులు చేతులెత్తేశారు. అరకొరగా ప్రాక్టికల్స్ నిర్వహించి సరిపెట్టేస్తున్నారు. ప్రాక్టికల్స్ పరీక్షలకు దగ్గర పడుతున్న సమయంలో హడావుడి చేస్తున్నారు. విద్యార్థులను ల్యాబ్‌లకు తీసుకెళ్తున్నారని విమర్శలున్నాయి. ఎవరైనా అడిగితే పబ్లిక్ పరీక్షల్లో మేము చూసుకుంటాంలే అని సమాధానమిస్తున్నారు.

జిల్లాలో..

- ప్రభుత్వ యాజమాన్య జూనియర్ కళాశాలలు : 71
- విద్యార్థుల సంఖ్య : 5 వేలకు పైగా

వారితోనే..

జిల్లా వ్యాప్తంగా 327 రెగ్యులర్ అధ్యాపకులు పోస్టులుండగా వాటిల్లో 106 మంది రెగ్యులర్ అధ్యాపకులు మాత్రమే ఉన్నారు. మిగిలిన వారిలో కాంట్రాక్ట్ – 168, గెస్ట్ ఫ్యాకల్టీ – 39, మినిమమ్ స్కేల్ టైమ్ – 7, పార్ట్‌టైమ్ ఏడుగురున్నారు. ప్రస్తుతం ఖాళీ అవుతున్న పోస్టుల్లో కేవలం గెస్ట్ ఫ్యాకల్టీ కిందే తీసుకుంటున్న పరిస్థితి ఉంది. చాలా ప్రభుత్వ కళాశాలల్లో అకడమిక్ క్యాలెండర్ ప్రకారం సిలబస్ పూర్తి కావడం లేదని విద్యార్థులు చెబుతున్నారు. నేటికీ కొందరికి ఇంటర్ పాఠ్య పుస్తకాలు అందలేదని తెలిసింది.

విజిట్ చేస్తున్నాం

జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ప్రాక్టికల్స్ నిర్వహణపై వారానికి ఒకసారి విజిట్ చేస్తున్నాం. అకడమిక్ క్యాలెండర్ ప్రకారం ప్రాక్టికల్స్ పీరియడ్లు నిర్వహించేలా చర్యలు తీసుకున్నాం. నాడు – నేడు పనులకు విడుదల చేసిన నిధులను ఖర్చు చేశాం. మళ్లీ నిధులు విడుదల చేయాల్సి ఉంది. రెగ్యులర్ అధ్యాపకుల స్థానంలో గెస్ట్ ఫ్యాకల్టీ కింద అధ్యాపకులను నియమిస్తున్నాం. ఎక్కడా అధ్యాపకుల కొరత లేదు.

– మధుబాబు, డీవీఈఓ

నిమ్మ ధరలు (కిలో)



పెద్దవి	రూ.29
సన్నవి	రూ.23
పండ్లు	రూ.12

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు



బ్రాయిలర్ (లైవ్)	120	బ్రాయిలర్ స్కిన్‌లెస్	240
లేయర్ (లైవ్)	85		
బ్రాయిలర్ చికెన్	218	లేయర్ చికెన్	145

నెల్లూరు మేత్రాసన సహవారస పీఠాధిపతి పట్టాభిషేకం


పట్టాభిషేక మహోత్సవంలో పీఠాధిపతి బిషప్ ఆంథోనీ దాస్


నెల్లూరు నగరంలో ర్యాలీ

నెల్లూరు(బృందావనం): నెల్లూరు మేత్రాసన సహవారస పీఠాధిపతిగా రెవరెండ్ మోన్సిన్యోర్ డాక్టర్ పిల్లి ఆంథోనీ దాస్ పట్టాభిషేక మహోత్సవం నెల్లూరులోని దర్గామిట్ట సెయింట్ జోసఫ్స్ ఇంగ్లిష్ మీడియం స్కూల్ మైదానంలో గురువారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమాన్ని పోప్ దూత బిషప్ లియోపోల్డ్ జరిల్లి, కార్డినల్ బిషప్ పూలా ఆంథోనీ, నెల్లూరు ఆర్సీఎం బిషప్ మోస్ట్ రెవరెండ్ ఎండీ ప్రకాశం వైభవంగా నిర్వహించారు. తొలుత జిల్లా పోలీస్ కార్యాలయం నుంచి సెయింట్ జోసఫ్స్ స్కూల్ వరకు ప్రదర్శన చేపట్టారు. ర్యాలీలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వాహనంలో ఆశీనులైన నూతన బిషప్ క్రైస్తవులు అభివాదం చేశారు. రోమ్ నగరం నుంచి వచ్చిన పోప్ దూత సమక్షంలో భారత్, నేపాల్ దేశ బిషప్‌ల ప్రతినిధి, హైదరాబాద్ బిషప్, కార్డినల్ బిషప్ పూలా అంథోనీ నూతన బిషప్‌కు పవిత్ర తైలం, బైబిల్, కిరీటంతో అభిషేకించారు. అనంతరం నూతన బిషప్ భక్తులనుద్దేశించి మాట్లాడుతూ ఇది దేవుని సంకల్పమని, ఏసుక్రీస్తు తనకు ఇచ్చిన కారుణ్య వరమన్నారు. కార్యక్రమంలో బిషప్‌లు ఉడుముల బాల, గాలిబాల, పొలిమేర జయరాజ్, టి.జోసఫ్ రాజారావు, ఆంథో ప్రిన్స్, రాయల విజయకుమార్, సగిలి ప్రకాష్, గోరంట్ల జోసేష్, కరణం థామస్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా అంతర్ కళాశాలల క్రికెట్ పోటీలు

• చాంపియన్‌గా నిలిచిన ఆత్మకూరు ఎస్ఆర్‌జేడీ కళాశాల



షీల్డ్ అందుకున్న విజేత జట్టు

ఆత్మకూరు: విక్రమ సింహపురి యూనివర్సిటీ పరిధిలోని అంతర్ కళాశాలల క్రికెట్ పోటీలు రెండు రోజులపాటు ఆత్మకూరు పట్టణంలోని ఎస్ఆర్‌జేడీ కళాశాల మైదానంలో ఉత్సాహంగా సాగాయి. గురువారం ఫైనల్స్ జరిగాయి. టాస్ గెలిచిన ఉదయగిరి మేకపాటి రాజమోహన్‌రెడ్డి కళాశాల జట్టు బ్యాటింగ్ ఎంచుకుని నిర్ణీత 12 ఓవర్లలో 84 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన ఆత్మకూరు ఎస్ఆర్‌జేడీ కళాశాల విద్యార్థులు పది ఓవర్లలో 85 పరుగులు చేసి విజయం సాధించింది. ప్రిన్సిపల్ జి.వరకుమారి ఆధ్వర్యంలో ఎస్ఆర్‌జేడీ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపల్ రఘురామచంద్రమూర్తి చేతుల మీదుగా విజేతలకు షీల్డ్, ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో యూనివర్సిటీ పరిశీలకులు ఎ.ప్రవీణ్‌కుమార్, పీడీ సిరిమామిళ్ల వెంకటేశ్వర్లు, వైస్ ప్రిన్సిపల్ పి.శ్రీనివాసులురెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

క్రీడాకారుల ఎంపిక రేపు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): విద్యుత్ సంస్థల ఇంటర్ సర్కిల్ పరిధిలో హాకీ, బాస్కెట్‌బాల్ పోటీల కోసం క్రీడాకారుల ఎంపికలు శనివారం ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో జరుగుతాయని ఏపీఎస్పీడీసీఎల్ జిల్లా స్పోర్ట్స్, గేమ్స్ సెక్రటరీ ఆర్.వేలు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 28 నుంచి 30వ తేదీ వరకు కాకినాడలో జరిగే పోటీలకు జిల్లా సర్కిల్ పరిధిలో ఉన్న విద్యుత్ కార్మికులు, జూనియర్ లైన్‌మెన్లు గ్రేడ్ – 2 అర్హులన్నారు. ఆసక్తి గల వారు ఎంపికల్లో పాల్గొనాలని కోరారు.

కండలేరులో 56.568 టీఎంసీలు



రాపూరు: కండలేరు జలాశయంలో గురువారం నాటికి 56.568 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. సోమశిల జలాశయం నుంచి 180 క్యూసెక్కుల నీరు వస్తోందన్నారు. కండలేరు నుంచి సత్యసాయి గంగ కాలువకు 650, లోలెవల్ కాలువకు 10, హైలెవల్ కాలువకు 110, మొదటి బ్రాంచ్ కాలువకు 70 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు వెల్లడించారు.